
## మినీకథ

ఓ మధ్యాహ్నవేళ మలమల మాడ్చేస్తున్న ఎండ తాపాన్ని లెక్కచెయ్యనంత సంబరంలో కొందరు ఆడంగులు ఓ ఇంటి గుమ్మం ముందు గుమిగూడారు.




కె. సుబ్రహ్మణ్యం

ఇంటావిడ రాధ ఇంట్లో పనికిరావనుకున్న పాత ఉడుపులన్నీ పోగుజేసి గుమ్మం బయట పెట్టింది. ఒక్కొక్క ఉడుపూ తీసి పైకెత్తి శల్యపరీక్ష చేస్తున్నాడు ఓ బట్టలుకొనే బేరగాడు. వాడి పక్కన పెద్ద గంపలో రకరకాల స్టీలు సామగ్రి వుంది. చుట్టూ మూగి ఆసక్తిగా బేరసారాలు చూస్తోన్న వాళ్ళను వాటి తళతళలు ఆకర్షిస్తున్నాయి.

"ఊఁ.. చెప్పు. మొత్తం పద్దెనిమిది గుడ్డలు."

"చిన్నవి పది" పెదవి విరిచాడు బేరగాడు

"గుడ్డలన్నాక ఆ మాత్రం పడవూ?"

"మీరే అడగండి" గంప ఆవిడ ముందుకు నెట్టాడు

"క్యారియరూ, ఈ కంచం యిచ్చి పట్టుకెళ్ళు." రాధ గంపలోనుంచి వున్న ఒక్క చిన్న క్యారియర్, ఓ పెద్దసైజు కంచం సెలక్టు చేసి అడిగింది.

"అబ్బో! మా మంచి బేరం చేస్తున్నారు! మీరు చూపించిన గుడ్డలు ఏపాటివిలెండి! ఇంకేదయినా వేసి బేరానికి దిగండమ్మా"

"అంతే. ఇంకేవీ ఇయ్యను నీ ఇష్టం"

"అయ్యో! అలా అంటారేంటమ్మా!"

అదోలా నవ్వేశాడు వాడు. "క్యారియర్ ఒక్కటీ వందకి తక్కువ చెయ్యదు కంచము ఖరీదు ఎక్కువేనండీ!"

"మా గుడ్డలేం తక్కువ కావు. అన్నీ నాణ్యమైనవే! ఒక్కదానికీ చిరుగులేదు. ఇచ్చే మాటుంటే తెముల్చు."

"కుదర్దమ్మా!" చేతులు పిసుక్కున్నాడు.

"అలాగే! నీ సామాను పట్టుకెళ్ళు!"

రాధ ఆదరాబాదరా బట్టలమోపెత్తి ఇంట్లోకి గిరాటేస్తూ "ఇహ చెప్పు. ఇటో, అటో తేలిపోవాలి" అన్నట్టు నిశితంగా చూసింది వాడ్ని. వాడంత సుళువుగా అక్కడ్నించి కదల్డని ఆవిడకి తెలుసు ఆవిడకి తెల్సని వాడికీ తెలుసు. వాడికి ఆ గుడ్డల బిజినెస్‌తో జీవనరథం సాఫీగా సాగిపోతుంది. ఆవిడ నిత్యావసరాలకి స్టీలు సామగ్రి కావాలి. అదీ చౌకగా! ఇద్దరికీ లాభసాటి బేరం కుదిరిందన్న తృప్తి వుండాలి.

చివర్న బట్టల బేరగాడు తగ్గాడు వేరే గత్యంతరం లేక. పొమ్మని జారవిడుచుకుంటున్నట్టు పోజు పెట్టి, కోరిన క్యారియరూ, కాస్త చిన్నసైజు కంచం తీసిచ్చి పాతగుడ్డల మోపు గంపలోకి సద్దుకుని లేచాడు. ఓ పొరుగమ్మ వాడ్ని తన ఇంటికి పిలిచింది. తతిమ్మావాళ్లూ కదిలారు. ఆ యింటావిడతో బేరం చూద్దామని.

ప్రస్తుతం రాధ తన శ్రీవారికి అంచి ఓ డొక్కు జర్మన్ సిల్వర్ క్యారియర్‌లో ఆఫీసుకి పంపిస్తోంది. అదిఎన్నో ఏళ్ళది. స్టీలు క్యారియర్ కొనాలనీ ఎప్పటినుంచో అనుకుంటూనే వాయిదావేస్తూ వచ్చింది. ఏడేళ్ళ తన బాబుకు భోజనానికి సరైన కంచం లేదు. ఇద్దరి సమస్యా కొత్త సామగ్రితో తీరబోతోంది. చౌకబేరమే! పోతే, చెల్లిపోయిన పాతదుస్తుల్లో కొన్ని ఖరీదైన గుడ్డలున్నాయ్! ఇంట్లో వాళ్ళు వాటిని వాడుకోనందుకు మూలన బడినయ్. కనుక అవి లేనందుకు ఆయనా, బాబూ పట్టించుకోరు అని సరిపుచ్చుకుంది.

శ్రీవారికి కొత్త క్యారియర్ బాగా నచ్చిందట సంతోషం! రాత్రి బాబుకు కొత్త కంచంలో అన్నం వడ్డిస్తుంటే, "ఎక్కడ కొన్నావమ్మా! చాల బావుంది!" అని సంబరపడ్డాడు. ఆ మెచ్చుకోలుకు ఆమె తబ్బిబ్బయిపోయింది.

ఇలా వుండగా ఓ నెల్లాళ్ళ తర్వాత—ఓ సాయంకాలం పొరుగు ఈడు జోడు పిల్లల్తో ఆడుకోవటానికెళ్ళిన బాబు రంయ్‌మంటూ యింట్లోకొచ్చి అమ్మని చూసి బిక్కమొహం వేసేసి:

"నా టెర్లిన్ పంట్లాం ఏదమ్మా!" అని అరిచాడు

చేస్తున్న పని ఆపింది రాధ. ఆమె గుండెలు కలుక్కుమన్నాయ్. వెంటనే తేరుకుంటూ—

"నీ అఘాయిత్యం గూలా! పంట్లాం అక్కర్లేదని గిరాటేశావ్‌గా! ఎక్కడ పడుందో, ఏమో!" అంది.

"ఉంది! పక్కింటి రాముకి ఎందు

కిచ్చేశావ్?" ఉలిక్కిపడింది. "ఏమిట్రా గోల? నీ పంట్లాం వాడికివ్వటమేం ఖర్మ! అలాంటివి బోల్డు షాపుల్లో దొరుకుతున్నాయి. వాడి నాన్న కొన్నారల్లే వుంది కొనా?" నెమ్మదిగానే అడిగింది.

"ఉహూఁ! అది అచ్చంగా నాకు కొన్నదే! పంట్లాం ముందు ఎడంపక్క పూలుతో కుట్టావే 'K' అక్షరం? అది నాకు బాగా గుర్తు" యమగోల పెట్టేశాడు బాబు

"నిజమేనా?! ఎక్కడ కొని వుంటారు చెప్మా! క్రితం నెల బట్టలు పట్టుకెళ్ళిన వాడి దగ్గరేనా? రాము నాన్న ఆఫీసరు. ఘనానా కుటుంబం వాళ్ళది. ఇతర్లు తొడుక్కుని విడిచేసిన ఉడుపుల్ని కొనే ఖర్మ వాళ్ళకేం పట్టింది? ఇదో ఫాషనా?"- మరి పోయిందావిడకి.

"నువ్వూరుకుంటావా? రెండంటించమంటావా?.... పక్కింటి ఆంటీని కనుక్కుంటా. నువ్విక్కడే వుండు." అంటూ రాధ బయటికొచ్చి, రాముని ప్రక్కకి పిలిచింది. బాబుకి కొన్న పాంటులాంటి నీలం టెర్లిన్‌ది వాడు వేసుకున్నాడు. మెచ్చుకుంటున్నట్టు దాన్ని పరిశీలించింది. ఎడం ప్రక్క కనీ కనిపించనంత చిన్న అక్షరం 'K' ఊదా రంగు పూలుతో కుట్టింది తనే! సందేహం లేదు! అది బాబుదే! అరవై పెట్టి కొన్న ఆ పంట్లాం, రాము నాన్న క్రితంరోజు పెద్ద బజారులో ఓ రెడీమేడ్ షాపులో అరవై అయిదు పెట్టి తెచ్చారట.

ఎప్పుడో ఒకావిడ యిలాంటి గుడ్డల బేరాల గురించి చెప్తోంటే తనంతగా పట్టించుకోలేదు. ఇప్పుడు తనదాకా వస్తుందని అనుకోలేదు. ఆ సంగతి మదిలో మెదిలింది.

స్టీలుపాత్ర లంటగట్టి తీసుకున్న పాత ఉడుపుల్లోంచి నాణ్యమైనవి ఏరి కొంత లాభానికి రెడీమేడ్ షాపువాళ్ళకు అమ్మేస్తుంటారనీ, షాపువాళ్లు వాటి రూపురేఖల్ని సరికొత్తవిగా మార్చేసి కష్టమర్స్‌కు అసలు ధరలకే అంటగట్టేసి హెచ్చు లాభాలు చేసుకుంటుంటారట. సాధారణంగా ఆ బాపతు దుస్తులు కొనుక్కున్న కష్టమర్స్‌కు కొత్త బట్టలకీ, సెకండ్ హాండ్ బట్టలకీ మధ్యనవున్న తేడా కనుక్కోవటం కష్టమేనట.

బాబుకికొన్న టెర్లిన్ ప్యాంటు సెకండ్ హాండ్ బాపతు కాదన్న రూఢి యేమిటి?

ఇప్పుడేం చేయాలి? – రాధ ఆలోచిస్తోంది

భర్తతో తమ బాబుకు కొన్న టెర్లిన్ పాంటు పాత దుస్తుల్తో కలిపి వేసినందుకు గ్గాను వచ్చిన స్టీలు క్యారియర్. కంచం వైనం విడమర్చి చెప్పలేదు. తెలిస్తే మండిపడతారు! బాబు మారాం యెక్కువవుతోంది. "పంట్లాం బదులుగా నీకు కొత్త కంచం తెచ్చిపెట్టానుగా! నీకో మామూలు ప్యాంటు కుట్టిస్తాను. సరేనా?;" అని యెంతో నచ్చచెప్పినా వాడు వింటేగా! వాడికి అలాంటిదే టెర్లిన్ ప్యాంటు కావాలంటున్నాడు! వాడికి కొత్త కంచం లెక్కలోకి రాదు. అమ్మ చేసిన తప్పుకు టెర్లిన్ పాంటుతో అప్పు తీర్చాలిసిందే!

(పిల్లలకోసం వాళ్ళ డబ్బు పెట్టి కొన్నవి చెల్లుకాక ఆ డబ్బు 'అప్పు'కిందే తమ తల్లిదండ్రులు ఇచ్చుకోవాల్సి వస్తుందన్న సత్యం అతి సహజంగా చెప్పిన శ్రీ పురాణం సుబ్రహ్మణ్య శర్మగారి "రెండ్రూపాయలు" కథ చదివాక.

—రచయిత)

# మన మెజీషియన్లు

## ప్రొఫెసర్ ఎ. శ్రీనివాసరావు M. B. M. C.

మెజీషియన్ & మిమిక్రిస్ట్



ఇంద్రజాలాన్ని వృత్తిగా స్వీకరించి ప్రదర్శనలిస్తున్న ఆంధ్రులు బహుతక్కువ మంది వున్నారు. వారిలో ఎ శ్రీనివాసరావు ఒకరు. చీరాలలో పుట్టి పెరిగి ప్రస్తుతం దేశం నలుమూలల్లోనూ విస్తృతంగా ప్రదర్శనలిస్తున్నారు 1948వ సంవత్సరంలో జన్మించిన రావు, తన పన్నెండవ సంవత్సరంలో కీర్తిశేషులు ప్రొఫెసర్ రమణారెడ్డిగారి మాజిక్ ప్రదర్శన చూడటం తటస్థించింది. అది చూసి ఉత్తేజితుడై తన తండ్రిగారైన శ్రీ నరసింహారావుగారికి మాజిక్ నేర్చుకోవాలనే కోర్కెను వెలిబుచ్చాడు. వారి అంగీకారంతో ఆశీర్వాదంతో మాజిక్‌ను శీఘ్రకాలంలో ఎంతో పట్టుదలతో నేర్చుకుని అచిర కాలంలోనే పెద్ద మెజీషియన్ల కోవలోకి చేరిపోయారు

వినోదం అందివ్వటంలో మాజిక్‌తోనే సరిపెట్టుకోక ప్రముఖ మిమిక్రీ సమ్రాట్ నేరెళ్ళ వేణు మాధవ్ గారివద్ద మిమిక్రీనికూడా అభ్యసించి, రెండు విద్యలను ప్రదర్శించి ప్రేక్షకుల ప్రశంసలూ, ప్రముఖుల ఆశీస్సులను పొందారు ఇంకా అంతటితో ఆగక యిపుడు తన ప్రదర్శనలో మైమ్ మరియు వెంట్రిలాక్విజం ద్వారా చేసే మాట్లాడే బొమ్మనుకూడా ప్రవేశ పెట్టబోతున్నారు.

మితభాషి, నిగర్వి అయిన శ్రీనివాసరావు భార్యా సమేతంగా ప్రదర్శనలిస్తూ, ఎప్పటికైనా మన ఆంధ్రదేశం మాజిక్‌ను కళగా గుర్తిస్తుందనే కొండంత ఆశతో వున్నారు. కనీసం రాష్ట్రంలో తిరిగే మెజీషియన్లకు బస్సు ప్రయాణాల్లో రాయితీ కల్పించాలని కోరుతున్నారు. నిజమే. బోల్డన్ని పెట్లు తీసుకెళ్ళే మెజీషియన్లకు కనీసం లగేజి చార్జీలు తీసుకోకుండా చేసినా చాలు. అదే వరంగా భావిస్తారు.

చిరునామా: ఒక వూరని లేదు. అన్ని వూర్లూ ఆయనవే (మీ వూరూ వస్తారు).

— బి. వి. పట్టాభిరాం
మెజీషియన్